చేవెళ్ల గడ్డపై.. బీసీల సత్తా చాటుదాం

బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కే మా సంపూర్ణ మద్దతు

అహంకారపూరిత నేతలకు చరమగీతం పాడుదామని పిలుపునిస్తున్న బీసీ నేతలు

చేవెళ్ల లోక్‌సభలో బీసీలకు వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ పాలనలో బీసీలు ఎదుర్కొన్న కష్టాలను తల్చుకుని నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ అభ్యర్థిని గెలిపించుకోకపోతే ఎదురయ్యే పరిస్థితులు ఊహించుకుంటేనే భయంగా ఉందని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఈ ఎన్నికల్లో బీసీల సత్తా చూపి అహంకారపూరిత నేతలకు చరమగీతం పాడుదామని పిలుపునిస్తున్నారు. చేవెళ్లలో బీసీలకు అందివచ్చిన ఈ అవకాశాన్ని బీసీల్లోని అన్ని కులాలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ వర్గాలకు ఇచ్చిన ప్రాధాన్యత.. లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో బీసీలకు కల్పించిన ప్రాధాన్యతను నేతలు ఈ సందర్భంగా కొనియాడుతున్నారు. బీసీలను అణచివేయాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేసినా.. తిప్పికొట్టి బీసీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. అన్ని కులాలు ఐక్యంగా ఉండి కాసానిని ఎంపీగా పార్లమెంటులో కూర్చోబెడతామని కుండబద్దలుకొట్టి మరీ చెబుతున్నారు.



– రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ)

మన బీసీ నాయకుడికి ఓట్లు వేసి గెలిపించుకుందాం

బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మన బీసీ నాయకుడికే ఓట్లు వేసి గెలిపించుకుందాం. ఎంపీగా జ్ఞానేశ్వర్ గెలుపొందితేనే పార్లమెంట్‌లో మన సమస్యలపై పోరాటం చేసి మనకు న్యాయం చేస్తారు. కొండా, గడ్డం ఎంపీలుగా గెలిచి సొంత ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను వదిలి ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఈ ఎన్నికల్లో కాసాని గెలుపొందడం ఖాయం.

– మహేశ్, చేవెళ్ల మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అభ్యర్థిగా పోటీ చేయించడం సంతోషకరమైన విషయం. బీసీలను చులకనగా చూస్తున్న నేతలను ఓడించి మన సత్తా చూపిద్దాం. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు పట్టం కట్టాల్సిన అవసరం ఉన్నది. పార్టీలకతీతంగా బీసీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి.

– ఇమ్రాన్, సింగప్పగూడ, చేవెళ్ల మండలం

చేవెళ్లను బీసీల అడ్డాగా మారుస్తాం

జ్ఞానేశ్వర్ గెలుపుతో బీసీలకు రాజకీయ గుర్తింపు వస్తుంది. మరింత అభివృద్ధి చెందాలంటే కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉన్నది. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలమంతా ఏకతాటిపైకి వచ్చి, కాసానిని గెలిపించుకొని చేవెళ్లను బీసీల అడ్డాగా మారుస్తాం. కేసీఆర్ బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉన్నది.

– ప్రవీణ్, మాసన్‌పల్లి, బషీరాబాద్

మంచి అవకాశం

బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలుపించుకునేందుకు ఇది మంచి అవకాశం. కాసాని అంటేనే బీసీ కులాలు గుర్తుకు వస్తాయి. బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని పార్టీలకతీతంగా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలి. బీసీల సత్తా దేశవ్యాప్తం కావాలంటే కాసాని గెలుపు ఒక్కటే మార్గం.

– అంజిలప్ప, ఇందర్‌చేడ్, బషీరాబాద్ మండలం

బీసీలంతా ఏకమవ్వాలి

బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు బీసీలంతా ఏకమవ్వాలి. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల నమ్మకాలతో ఆడుకునే వ్యాపారవేత్తలకు తగిన బుద్ధి చెబుతూ బీసీల బలాన్ని ఢిల్లీ వరకు తెలిసేలా చేద్దాం. బీసీలతో పాటు మిగతా వర్గాల ప్రజలు సైతం కాసాని గెలుపునకు మద్దతుగా నిలువడం ఖాయం. చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగరడం పక్కా.

– మల్లేశ్, చందానగర్

బీసీ నాయకుడిని గెలిపించుకుందాం

బీసీల సంక్షేమం కోసం ఏండ్లుగా పోరాడుతున్న నేత కాసాని జ్ఞానేశ్వర్. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యాపారాలు, స్వార్థ రాజకీయాలతో పదవి కోసం పాకులాడే నాన్ లోకల్ లీడర్లకు ఎన్నికల్లో పరాభవం తప్పదు. బీసీలందరూ అప్రమత్తంగా ఉండి కాసాని గెలుపునకు కృషిచేద్దాం.

– శంకరి రాజు ముదిరాజ్, శేరిలింగంపల్లి

మన ఓటు మనమే వేసుకుందాం

మన ఓట్లు మనమే వేసుకొని బీసీల సత్తా చాటుదాం. బీసీలను తక్కువ చేసి మాట్లాడుతున్న వారికి ఓటుతో బుద్ధి చెబుతాం. బీసీలను గుర్తించి చేవెళ్ల పార్లమెంటుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇవ్వడం శుభ పరిణామం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు సముచిత స్థానం కల్పించారు.

– యాతం బాల్‌రాజ్ యాదవ్, సంఘం నాయకుడు, బడంగ్‌పేట

గులాబీ జెండాను ఎగురవేద్దాం

చేవెళ్ల పార్లమెంటు గడ్డపై గులాబీ జెండాను ఎగురవేద్దాం.. బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా గెలిపించి పార్లమెంట్‌కు పంపుదాం. బీసీ వాణి, బాణిని వినిపించే ఏకైక గొంతుక కాసాని. గతంలో బీసీల కోసం అనేక ఉద్యమాలు చేశారు. బీసీల కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేసిన కాసానికి ఒక్కసారి అవకాశం ఇద్దాం.

– కిరణ్, బీసీ సంఘం నాయకుడు, బడంగ్‌పేట

కాసానితో బీసీలు ఆర్థికంగా ఎదిగారు

బీసీల సంక్షేమం కోసం కృషిచేసిన వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్. ఆయన చేసిన పోరాటాల ఫలితంగా ఎంతో మంది బీసీలు ఆర్థికంగా ఎదిగారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా చైర్మన్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న నాయకుడు జ్ఞానేశ్వర్. అలాంటి వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. బీసీలందరూ ఐకమత్యంగా కలిసి ఎలాగైనా కాసానిని గెలిపించుకుంటాం.

– పరమేశ్, అత్తాపూర్

ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడతాం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన బీసీ నేత కాసానిని చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించడం హర్షణీయం. ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడతాం. బీసీలందరూ కారు గుర్తుకు ఓటువేసేలా ప్రచారం చేస్తాం. బీసీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి.

– రాము యాదవ్, హైదర్‌గూడ

బీసీల సత్తా చూపిస్తాం

బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చి గౌరవించింది. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా బీఫామ్ ఇచ్చి గౌరవించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. జనాభాలో సగభాగం ఉన్న బీసీలందరూ కాసానీ జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవడం ఒక్కటే మిగిలి ఉన్నది. బీసీలతో పాటు ఇతర కులాలు కూడా జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలి.

– ప్రశాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పూలపల్లి

బీసీ నేతకు పట్టం కడుతాం

చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేసీఆర్ టికెట్ కేటాయించారు. ఆయనను గెలిపిస్తే సామాజికంగా న్యాయం జరుగుతుంది. కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపిస్తాం. బీసీలకు న్యాయం జరిగేందుకు బీసీ నాయకుడిని గెలిపించుకోవాలి.

– మాలె కృష్ణయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ, కులకచర్ల

కాసాని గెలిస్తేనే సమస్యల పరిష్కారం

కాసాని బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా ఉంటారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నిలబెట్టిన జ్ఞానేశ్వర్‌కు ప్రతి ఒక్కరి మద్దతు ఉంటుంది. కాసాని గెలుపు కోసం మా వంతు కృషిచేస్తాం. కాసాని గెలిస్తేనే కేంద్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేసేందుకు అవకాశముంటుంది. జ్ఞానేశ్వర్ మచ్చలేని నాయకుడు.

– గుండుమల్ల నర్సింహులు, తిర్మలాపూర్, కులకచర్ల మండలం

బీసీ బిడ్డను గెలిపించుకుందాం

బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని. రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత జ్ఞానేశ్వర్‌కు దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే.

– శ్రీనివాస్‌గౌడ్, నారాయణపూర్, వికారాబాద్

రేవంత్‌రెడ్డి మల్కాజిగిరికి ఏం చేశాడు..

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్. పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

నిజాంపేట్ కార్పొరేషన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో రంగరాయప్రసాద్ తదితరులు

దుండిగల్/కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 22: గత అసెంబ్లీ ఎన్నికల్లో కొండగల్‌లో ఓడిన రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గానికి ఏం చేశాడని బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని ఎంఎం గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన దుండిగల్ మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కొండగల్‌లో ఓడిన రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరి ప్రజలు ఆదరించి ఎంపీని చేస్తే, నియోజకవర్గం పరిధిలో ఏ ఒక్క ప్రాంతంలో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లి అభివృద్ధి కుంటు పడిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ప్రజలకు ఒరిగేది ఏమీలేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తుడుం పద్మా రావు, దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, నేతలు బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్ తదితరులతోపాటు పెద్దసంఖ్యలో నేతలు పాల్గొన్నారు.

❖ మన ప్రాంత అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సోమవారం సూరారం డివిజన్ మార్కండేయనగర్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ఉపాధ్యక్షులు అఖిల్, ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి, అరుణ, సీనియర్ నాయకులు ఫిరోజ్, మార్కండేయనగర్ అధ్యక్షుడు విఠల్, మైనార్టీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జమీల్, నవీన్, రెహమాన్, వైకుంఠ, లావణ్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

❖ గాజులరామారం డివిజన్ పరిధిలోని మెట్ కానిగూడ, మారుతినగర్, పెద్దమ్మగడ్డ బస్తీలల్లో ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ రావులశేషగిరి, స్థానిక నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

❖ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సీసాలో బస్తీ, దేవమ్మ బస్తీ, పాపిరెడ్డినగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తోపాటు డివిజన్ అధ్యక్షుడు రుద్రశోక్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ వేణుయాదవ్‌తో పాటు స్థానిక నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

❖ కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్‌లో జరిగిన ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్ గౌరీశ్ పాల్గొన్నారు.

❖ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 11, 12వ డివిజన్‌లోని పలు కాలనీల్లో నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వాకలపూడి రంగరాయప్రసాద్ అధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్లు వాకలపూడి రవికిరణ్, బాలాజీనాయక్, జ్యోతిన్రింహా రెడ్డి, పైడి మాధవి, సుజాత, మహిళా విభాగం అధ్యక్షురాలు అర్పిత, సీనియర్ నాయకులు సతీశ్, చందు తదితరులు పాల్గొన్నారు.

రాగిడి గెలుపు కోసం.. ఇంటింటి ప్రచారం చేయండి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22 : మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, పేదలకు అందిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో మరల కరెంట్, తాగునీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. కూకట్‌పల్లిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. గడపగడపకు వెళ్లాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా సంఘటితంగా పనిచేసి.. రాగిడికి భారీ మెజార్టీని అందించాలి కోరారు. అలాగే ఈనెల 24న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఈ కార్యక్రమానికి డివిజన్‌ల వారీగా బీఆర్ఎస్ పార్టీ నేతలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 22: చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మంగళవారం తన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం తెలిపారు. రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై దిగ్విజయం చేయాలన్నారు. రెండుసార్లు బీఆర్ఎస్ అఖండ విజయం సాధించిందని, మూడోసారి తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

ఆలోచనలకు పదునుపెడితే అద్భుతాలే

ఆలోచనలకు పదునుపెడితే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని ఎంఎల్ఎస్ సురభి వాణి దేవి అన్నారు. ధరణి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మదాపూర్‌లోని శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో కెనడీయన్ ఉడ్ సహకారంతో 'డిజైన్ కాంపిటేషన్' పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అజితా శేఖర్, ప్రిన్సిపల్ కామిని సింగ్, రితేష్ కుమార్, జిమ్మి థామస్, తదితరులు పాల్గొన్నారు. – కొండాపూర్, ఏప్రిల్ 22

రాష్ట్రస్థాయి క్రీడల్లో సెయింట్‌మార్టిన్ విద్యార్థుల ప్రతిభ

ప్రతిభకనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్‌కుమార్

కుత్బుల్లాపూర్,ఏప్రిల్ 22: ఎంఎల్ఆర్ ఐటీ కళాశాలలో మర్రి లక్ష్మణ్‌రెడ్డి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్-2కే24లో నెల 15, 16 తేదీల్లో దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రదర్శనతో మొదటిస్థానాలను కైవసం చేసుకున్నారు. ఆయా కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో భాగస్వాములు కాగా, సెయింట్ మార్టిన్ కళాశాలకు చెందిన ఎం.శశాంత్, లోకేశ్ గౌడ్, అలేఖ్యలు టేబుల్‌టెన్నిస్‌లో రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు జ్ఞాపికలతోపాటు బహుమతులను అందించగా, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌యాదవ్, ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్‌కుమార్‌పాత్రలు అభినందించారు.

వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటెయ్యాలి

ఏఆర్‌వో, జడ్పీ అభిలాష

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22: వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకోవడానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కూకట్‌పల్లి ఏఆర్‌వో, జడ్పీ అభిలాష అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గంలో 85ఏండ్లు పైబడిన వృద్ధులతోపాటు దివ్యాంగుల ఓటర్లను గుర్తించడం జరిగిందన్నారు. ఆయా పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోల సాయంతో ఆ ఓటర్లను కలిసి ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని వివరించి దరఖాస్తులను అందించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పూర్తి చేసిన దరఖాస్తులను బీఎల్‌వోకు గానీ, నేరుగా ఏఆర్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ గడువు నేటితో ముగుస్తుందని, మంగళవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హత కలిగిన వారికి ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించడం జరుగుందన్నారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

అల్లాపూర్, ఏప్రిల్ 22 : అసలే వేసవి కాలం కావడం, భూగర్భ జలాలు అడుగంటిపోయి కాలనీవాసులు నల్లా నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో లోప్రెజర్ కారణంగా తాగునీటి సరఫరా అంతంత మాత్రమే, దీనికి తోడు నీరు కలుషితం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యను పరిష్కరించి శుద్ధమైన నీటిని సరఫరా చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సోమవారం శ్రీవివేకానందనగర్ కాలనీవాసులు కార్పొరేటర్ సబీహాబేం కోరారు. ఈ సమస్యను జల మండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఓటరు అవగాహన

మియాపూర్, ఏప్రిల్ 22 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటరు అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాలనీవాసులతో సమావేశాలు, పార్కుల్లో పాదచారులతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

వర్సిటీలో నేర్చుకున్న పరిజ్ఞానంతో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని, నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి సారించాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ కట్టా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం వర్సిటీ జేఎన్ ఆడిటోరియంలో టెక్నికల్ ఫెస్ట్ 2024 ప్రారంభోత్సవంలో వీసీ కట్టా నరసింహారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటనర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22

వ్యక్తి అదృశ్యం

మియాపూర్, ఏప్రిల్ 22: విధులకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకున్నది. మియాపూర్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. టెక్ మహీంద్రాలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కేవీ ప్రసాద్‌రెడ్డి (46) సోమవారం ఉదయం 9.20 గంటలకు రోజులాగానే ఆఫీసుకు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవటంతో భార్య వాకబు చేయగా, ఆఫీసుకు వెళ్లలేదని తెలిసింది. ఫోన్‌ను సైతం ఇంట్లోనే ఉంచి వెళ్లాడు. కుటుంబ, ఆర్థిక పరమైన సమస్యలేవని భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సుచిత్ర నారాయణ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

కుత్బుల్లాపూర్, ఏప్రిల్22 : సుచిత్ర నారాయణ పాఠశాల ఆవరణలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలను అందించడంతో వివిధ వేషధారణతో చూపరులను ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత, కో-ఆర్డినేటర్స్ కిరణ్, దీప్తి, అంబిక, డీన్ సాయిప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రతిభ, యశోదతోపాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 22 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) ఇలా ఉన్నాయి. టమాట 19, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 60, బజ్జి మిర్చి 40, కాకరకాయ 35, బీర కాయ 45, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 70, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 50, గోరుచిక్కుడు 33